


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### స్వచ్ఛ భారత్

**ప్రొద్దుటే చెత్త అబ్బాయి 'ఈల' వేసాడు.** బాల్కనీలోంచి చూసాను. ఆ ఈలకి మా కాలనీలో ఉన్న ఇల్లాళ్ళందరూ నిద్రపక్కలమీద నుండి బిరబిరా పరిగెడతారు. ఆ ఈలకి అంత పవర్ ఉంది. లేకపోతే చెత్త తీసుకెళ్ళడు.

"నువ్వు ఈల వేస్తే గోల్కొండ అదిరిపడ్డదీ.." టైప్‌లో అతనే మా పాలిట 'మా పల్లెలో గోపాలుడు'. అసలు చెత్త గురించి మాట్లాడుతుంటే, మా చెల్లెలు ఒకత్తి గుజరాత్‌లో ఉన్నప్పుడు ఈ 'రద్దీ పండగ' గురించి చెప్పింది. వాళ్ళకి సూరత్‌లో 'రద్దీ పండగ' మొదలవగానే, ఆ చెత్త తీసుకుని కూపన్‌లు ఇచ్చే షాపులకి ఆడాళ్ళూ, మగాళ్ళూ చెత్త బళ్ళ కొద్దీ తీసుకుని పరిగెత్తేవారుట. ఇన్ని కిలోల చెత్తకి ఇంత డిస్కౌంట్ అని ఉండేదిట. అంటే మన ఇంట్లో (మనుషులని వదిలేసి) పనికిరాని సామానంతా, అట్టపెట్టెలు (మా తోడికోడలు చీరలు కొన్నాకా వాటిని అస్సలు పడెయ్యదు) ఖాళీ మేచ్‌బాక్సులు (చిన్నప్పుడు అన్ని స్టేట్స్ మేచ్‌బాక్సుల ముఖచిత్రాల కలెక్షన్ ఉండేది నాకు) విరిగిన బల్లలూ, కాలుకుంటి కుర్చీలూ, చెవుల్లేని కప్పులూ (అసలు కప్పులో కాఫీ తాగడానికి చెవులెందుకు దానికి?) చిరిగిన బట్టలూ, అరిగిన చెప్పులూ.. అయిపోయిన పౌడర్ డబ్బాలూ, పేస్ట్‌డొక్కులూ (అప్పడాల కర్రలతో కూడా వత్తేసాకా) విరిగిన వినాయకుడి బొమ్మలూ (ప్రతి ఏడూ దాస్తారు కొందరు) మనం ఒకప్పుడు మనుసుపడి కొనుక్కుని, ఇప్పుడు మొదటి పాతిక పేజీలూ, ఆఖరి ఆరు పేజీలూ పోయిన నవలలూ, పిల్లలు పాలు తాగేటప్పుడు కొన్న పాల డబ్బాలూ (ఇప్పుడు వాళ్ళ పిల్లలు స్కూలుకి వెళ్తుంటారు) ఇలాంటివి అన్నీ, అటకల మీద నుండి తీసి గోనె సంచుల్లోకి ఎత్తి వాటిని మొగుడి వీపు మీద పెట్టి, ఆ రద్దీ మేళాకి వెళితే, అక్కడ హనుమంతుడి తోక అంత క్యూ ఉండేదిట. తిండి తిప్పలు లేకుండా వీళ్ళు ఇలా ఎండలో సాయంత్రందాకా మలమలా మాడిపోయాక, క్యూలో వీళ్ళ వంతు వచ్చేసరికి ఒక్కోసారి ఆ 'డిస్కౌంట్ కూపన్‌లు' అయిపోయేవిట. ఇంతకీ వాడు ఈ చెత్తకి కూపన్‌లే ఇస్తాడు కానీ డబ్బులు ఇవ్వడు. ఆ డిస్కౌంట్ అతను ఇచ్చిన మాల్స్‌లోనే దొరుకుతుంది.

తరువాత తరువాత ఈ చెత్త వడదెబ్బలు ఎడాపెడా తిన్నాకా మా చెల్లెలుకి అర్థమైన విషయం ఏమిటంటే, ఆ కూపన్ వల్ల ఒరిగేదేం లేదు. అసలు ధరలు పెంచి, వాటిమీద ఈ డిస్కౌంట్లు వేస్తారు. అది సరే ఈ చెత్త అంతా ఏం చేస్తారయ్యా అంటే ఊరి చివర డంప్‌యార్డ్‌కి తీసుకెళ్ళి కాల్చేస్తాడు. సో సింపుల్..

చిన్నప్పుడు మా అన్నయ్య ఓ కథ చెప్పాడు నాకు. దాని పేరు 'పాత లాంతర్లకి కొత్త లాంతర్లు.' ఎక్కడో విన్నట్లు ఉందికదూ!

అల్లాద్దీన్ కథ ఇలాగే అద్భుత దీపాన్ని పాత పనికిరాని 'చెత్త' అనుకుని, 'పాతలాంతర్లకి కొత్త లాంతర్లు ఇస్తాం' అన్న మోసగాడి జిమ్ముక్కుకి పడిపోయి అల్లాద్దీన్ పెళ్ళాం 'అద్భుతదీపం' కాస్తా ఇచ్చేసి 'కొత్తదీపం' తీసుకుంటుంది. పాత దీపం రుద్దగానే 'జీనీ' ప్రత్యక్షమయి "జీనీ నాకు ఇప్పుడు ముంబై వడాపావు తినాలనుంది కానీ నేను చార్మినార్లోనే ఉంటాను" అంటే రెండు నిమిషాల్లో ముంబై పుర వీధుల్లోంచి తెచ్చి పెట్టేది.

ఇంకా బెటర్ విషయాలకి అంటే ఎలక్షన్స్లో రిగ్గింగ్లకీ, అసెంబ్లీలో అంతా చేష్టలుడిగి, మంత్ర ముగ్ధులై మనం చెప్పేది వింటూ, ప్రతిపక్షం వాళ్ళు కూడా చప్పట్లు కొట్టేట్లు కూడా జీనిని వాడచ్చు. కానీ నాకు ఎందుకో వడా పావ్ మాత్రమే గుర్తొచ్చింది

సో ఈ కథను ఆధారంగా చేసుకుని మా అన్నయ్య ఒక కథ చెప్పాడు. ఈ రకంగా 'పాత పట్టుచీరలకి కొత్త పట్టుచీరలిస్తాం.', 'పాత ఇనప సామాన్లకి కొత్త సామాన్లు ఇస్తాం.', 'పాత వాషింగ్ మెషిన్లకి కొత్త వాషింగ్ మెషిన్లు ఇస్తాం' అని ప్రకటనలిచ్చి, జనం కుక్కర్లు, గ్యాస్ స్టౌలు, పట్టుచీరలు పట్టుకుని హడావిడిగా 'ఆఫర్' అయిపోతుందేమోనని పరిగెత్తేట్లు చేస్తారు వ్యాపారస్తులు. తీరా వెళితే ఏవుంది? కాస్త రిబేట్ ఇచ్చి వాళ్ళ డామేజ్డ్ గూడ్స్ వదిలించుకుంటారు. మనం అపురూపంగా తీసుకెళ్ళిన చెత్త డంప్యార్డ్లో వదిలించుకుంటారు.

ఈ సూక్ష్మం తెలియక మనం చెత్తమోసుకుంటూ పరుగులు పెడ్తుంటాం.

అదే ఇంటి ముందుకొచ్చి నిజంగా 'రీ సైక్లింగ్' చేసే ఖాళీ సీసాలూ, పాత డబ్బాలూ, ప్లాస్టిక్ మగ్గులూ, చిత్తుకాయితాలూ కొనే చిరుగుల బట్టల చింకిజీవిని ఇన్సల్ట్ చేసేసి ఆడవాళ్ళు "తూకంలో మోసం చేసేస్తారు వీళ్ళు. ఇంటి ముందుకొస్తే అమ్మకూడదు వదినా.. అదిగో ఓ పేపర్ తియ్యి.. అమ్మో.. కళ్ళల్లో కారం కొట్టేస్తున్నావే?" అని తమ ఆస్తంతా దోచుకునే బందిపోటుని చూసినట్లు మాట్లాడ్తారు. పాపం వాళ్ళు నిజంగా మనకి పనికి వచ్చే చెత్త వాళ్ళు.

ఇంక నా చిన్నప్పటినుండి చూస్తున్నాను ఆదివారాలు ఇల్లు శుభ్రాలూ, చెత్తపారవేయటాలు అనే ప్రోగ్రామ్స్ పెట్టుకుంటారు గృహస్తులు.

"ఇదంతా చెత్త!" అని మా ఆయన నా పాత మాన్యు స్క్రిప్ట్సనీ, కథలనీ కట్టలు కట్టి పారేయ్యాలని చాలాసార్లు ట్రై చేసారు. నేను ఆయన బయట పెట్టగానే ఇంట్లోకి తెచ్చి ఆయన బట్టలు అన్నీ అల్మారాలోంచి తీసేసి వాటిల్లో ఇవి సర్దేస్తుంటా!

మా ఆడబడుచు నా హేండ్ బ్యాగ్లనీ, డైరీలనీ, ప్రతి రెండో నెలా కొనే చెప్పులనీ అందరూ ఇచ్చే రిటర్న్ గిఫ్ట్లనీ "ఇవన్నీ చెత్త" అని డిక్లేర్ చేసి పారెయ్యడానికి ట్రై చేసేది. నేను మాట్లాడకుండా అవన్నీ లోపలికి తెచ్చి 'ఈ హేండ్ బ్యాగ్ ఫలానా సందర్భంగా కొన్నానూ, ఈ చెప్పులు ఎండా కాలం ఎవరికైనా దానం చెయ్యొచ్చు, ఈ రిటర్న్ గిఫ్ట్లు ఫలానా వాళ్ళ జ్ఞాపకార్థం' అని దాచేస్తుంటా.

సోమవారం నాడు ప్రొద్దుటే "మమ్మీ... అమ్మా.. మా .." అని మా పెద్దాడు గగ్గోలు పెడుతూ గావుకేకలు పెడ్తుంటే, వాడి వస్తువు ఏదో కనిపించడంలేదని నాకు అర్ధమౌతుంది.

"అమ్మా నాన్న మళ్ళీ నా బెల్ట్ పారేసారు. చార్జర్ మాయం అయింది. నా వైట్ స్వెట్టర్ కనిపించట్లేదు. కాన్వాస్ షూస్ పారేసారా?" అని అరుస్తూంటే, అది మా వారి ఆదివారం వ్యాపకం అని నాకు అర్ధమౌతుంది. ఓసారి పదివేలరూపాయల 'ఓక్లే' గ్లాసెస్ కూడా ఆయన 'స్వచ్ఛభారత్'లో భాగంగా పారేసారు.

ఈ విషయంలో ఒక్కోసారి ఆయన గుండె ధైర్యాన్ని మెచ్చుకోవాలి కూడా 'ఆరువేల స్వెట్టర్ని' డ్రైవర్ అడిగాడని సునాయాసంగా ఇచ్చేస్తారు, అదే మనం మూడువేల చీర కొనమంటే, అరుణ్జెట్లీలా ఆర్థిక విధానాలు బోధిస్తారు అనుకోండీ!.

నాకో బ్రెజిల్ స్నేహితుడు ఉన్నారు. రాయలగారు అని. ఆయన ఈ 'చెత్త' మీద పరిశోధనలు చేసి, చెత్తనుండి విద్యుత్తు తయ్యారు చేసే పరిశ్రమ పెట్టి కొంతకాలం శ్రమపడి, అది ఎవరికో అప్పగించి బ్రెజిల్ వెళ్ళిపోతే, అది కాస్తా మూతపడింది. కానీ చెత్తని ఆ విధంగా ఉపయోగిస్తే మన సమస్యలన్నీ తీరుతాయి.

మా వారి స్వచ్ఛభారత్ ఎలాగూ మొదలు పెట్టాను కాబట్టి, ఇంకో విషయం కూడా ఆయన గురించి చెప్పాలి.

ఆదివారం మనం చాకిరేవు పెట్టాలీ, తలంటుపోసుకోవాలీ, ఇళ్ళు కడగాలి అని అత్యుత్సాహంతో లేస్తే, పంపు తిప్పితే ఒక్క చుక్కకూడా రావు. ఇంకాసేపు పడుకుందాం అని ఏ.సి ఆన్ చేస్తే పని చెయ్యదు. ఎందుకంటే, మనం కళ్ళు విప్పేటప్పటికే మన ఇంట్లో చాలామంది వ్యక్తులు తిరుగుతుంటారు. చాలా అలవాటుగా తిరుగుతుంటారు. ఎందుకంటే వీళ్ళు మా ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్, కార్పెంటర్, మేస్త్రిలాంటివాళ్ళు. వాళ్ళకి 'సార్' ప్రతి ఆదివారం ఎలాగూ పిలుస్తారు కనుక ఏదో ఒక పని పెట్టుకుని అలవాటుగా వచ్చేసి, ప్లంబర్ నీళ్ళు కట్ చేసి, ఎలక్ట్రీషియన్ పవర్ కట్‌చేసి, బిజీగా ఉంటారు.

నేను ఇవాళ ప్రొద్దుటే కిచెన్‌లో ఓ గుండు అబ్బాయిని చూసి 'ఎవరో అబ్బాయి కిచెన్‌లోకొచ్చేసాడు. ఎవరో చూడు' అని మా అశ్విన్‌తో అంటే, "అమ్మా నువ్వు ఆ స్టూడియో వన్‌లో వచ్చే బ్లాక్ అండ్ వైట్ సినిమాలు చూడకు - అతను మన రెగ్యులర్ డ్రైవర్.. కేవలం గుండు చేయించుకున్నాడు అంతే. ఇలా ఉలిపిరికాయ బుగ్గ మీద పెట్టుకుంటేనూ, జుట్టు పెంచుకుంటేనూ, గుండు చేయించుకుంటేనూ మనుషుల్ని గుర్తుపట్టకపోవడానికి ఇదేమైనా 'ఎన్.టీ.ఆర్' సినిమానా? రేపు నాన్న ఏ గర్ల్‌ఫ్రెండ్‌తోటైనా ఏ ఎయిర్‌పోర్ట్‌లోనో కనిపించి, నువ్వు 'ఏవండీ?' అంటే 'మాకీ బేగం మీకీ తెలుసా మేమ్‌సాబ్' అంటే 'ఓ మా ఆయన కాదేమో' అని వెళ్ళిపోతావ్" అని హెచ్చరించాడు.

అప్పుడు చూసా... డ్రైవర్ 'అక్వాగార్డ్'లో వాడి ఆరోగ్యం కోసం అతి శ్రద్ధగా నీళ్ళు పట్టుకుంటున్నాడు. అదే నాకైతే నిర్లక్ష్యంగా ఎక్కడో బోర్ వాటర్ పట్టి బాటిల్‌లో పెడ్తాడు.

ఈ స్వచ్ఛ భారత్ యజ్ఞంలో మా ఆడబిడ్డ నా చిన్నప్పటి నుండీ శ్రమిస్తోంది. చెట్టు నుండి ఆకు రాల్తుంటే ఈవిడ మధ్యలోనే పట్టుకుని అగ్గిపుల్ల గీసేస్తుంది. ఓసారి పక్కవాళ్ళ కారు కూడా తగలబెట్టపోయింది చిత్తు ఆకులతో కలిపి.. చచ్చాం ఆర్పలేక. ఇంక మా ఎదురింటి ఆవిడ శుభ్రత మరీ ఎక్కువై ఇంటిముందు రోడ్డు నిర్మా వాషింగ్ పౌడర్ వేసి రుద్ది రుద్ది కడగడం చూసి నేను నిర్ఘాంతపోయాను.

మా ఆయన అప్పుడప్పుడు "ఇంట్లో చెత్త ఎక్కువైపోయింది" అంటుంటారు. అలాంటప్పుడు ఆయన చూపు సరిగ్గా నా అవార్డులు ఉన్న షోకేస్ మీదే ఉంటుంది. నా నందులు కూడా బేలగా చూస్తాయి.

ఇలా చెత్త విషయాలు ఆలోచిస్తూ హాల్లోకి రాగానే మా డైరెక్టర్ ఒకరు ఫోన్ చేసారు. "పండక్కి మా ఆవిడ చీర అడిగింది, నీకేం కొనివ్వనే.. ఆ గోడకున్న మేకుకి కొనిస్తా.. అన్నా" అన్నాడు.

"అదేవిటీ?" అన్నాను.

"ఆ గోడకున్న మేకే భరిస్తోంది నేను కట్టిన మంగళసూత్రాన్ని.. ఇదికాదు" అన్నాడు. అవును.. ఆడవాళ్ళకి మంగళసూత్రాలు ఈ మధ్య భరించరాని బరువే అవుతున్నాయి.

"అసలు ఇల్లంతా రకరకాల నెయిల్ పెయింట్స్, లిప్‌స్టిక్కులు, క్రీమ్‌లూ, క్లిప్పులూ, హెయిర్ కలర్స్, అన్నీ నింపేస్తుంటుంది.. మొహానికీ ఒంటికీ ఇన్ని పూతలు వేసి మోయిస్తోందే నేను కట్టిన తాళి ఎందుకు మొయ్యదు?" అని ఆవేశపడ్డాడు.

నిజమే అద్దం ముందు నిలబడి అయిపోయిన క్రీములూ, హెయిర్ ఆయిల్స్, విరిగిన క్లిప్పులూ, పాతబడిన బొట్టు స్టిక్కర్స్, అన్నీ క్లీన్ చెయ్యాలి అని అటు నడిచాను.

ఇలా ఇల్లు క్లీన్ చేస్తూ నేను మధ్య మధ్యలో 'కెవ్వు కెవ్వు'మని అరుస్తుంటాను. ఎందుకంటే ... ఎప్పుడో పోయాయని మళ్ళీ కొనుక్కున్న మట్టెలూ, మా పెద్దాడి చంటప్పుడు కొన్న వెండి చెమ్చా, మా పెళ్ళయిన కొత్తలో కొన్న 'ఐసోలీ 100' కెమేరా, ప్రేమ కొద్దీ ఓ అభిమానికొనిచ్చిన 'స్వరోస్కీ పెన్' ఇలా చాలా వేల్యుబుల్స్ మనం పారెయ్యాలనుకునే చెత్తలో దొరుకుతాయి.

మా బామ్మ లేనప్పుడు ఆవిడ పెట్టె వెతికితే, మా పెద్దత్తయ్య పెళ్ళప్పటి కర్పూరపు దండలూ (పెద్దత్తయ్యకి డెబ్భై ఏళ్ళుంటాయి అవి దొరికినప్పుడు) తన బాల్యంలో కొనుక్కున్న అత్తాకోడళ్ళ అంచు చీర (అది జీర్ణావస్థలో ఉంటుంది). ఎవరింట్లోనో పెళ్ళిలోవి గంధపు ఉండలూ (అవి ఇప్పుడు గబ్బు వాసన కొడుతుంటాయి) ఇంకా ప్రమాదకరమైనవి, నా అన్నప్రాసనప్పటి లడ్డూలు.. (అవి పాయిజన్‌తో సమానం). నా మూడేళ్ళప్పుడు కొన్న అలివేలుమంగాపురం లోని నీలం రంగు పద్మావతీ గాజులు ఇవన్నీ ఆ పెట్టెలోంచి బయటపడ్డాయి.

మా మావగారు సడెన్‌గా ఓ రోజు 'నేను నీ దగ్గరే ఉంటాన్రా' అని మా ఆయనతో డిక్లేర్ చేసి, మా చిన్నాడు పుట్టిన కొత్తల్లో మా మూడుగదుల చిన్న అద్దె ఇంట్లోకి, ఓ ఎద్దుబండి మాట్లాడుకుని, తన సామానంతా వేసుకుని వచ్చేసారు.

పిల్లాడ్ని చంకనేసుకుని, నోరంతా తెరుచుకుని నేను ఆయన సామాను దింపుతుంటే, బొమ్మలా చూస్తూ నిలబడ్డాను. ఆయన చిన్నప్పటి నుండీ వాడుతున్న ఖాళీ మాదీఫలరసాయనం, ద్రాక్షారిష్ట సీసాలు, భావనా అల్లం, జీలకర్ర, సైంధవలవణం, భాస్కర లవణం ఇత్యాది చూర్ణాలూ, పదహారు ఏళ్ళుగా సేకరిస్తున్న ఖాళీ మిల్క్ పౌడర్ టిన్నులు, పెట్టెడు బయోజెన్ మందులు, రెండు ఇనపపెట్టెల నిండా సైగల్, బేగం అక్తర్, కారైపూడి అరుణాచలం, చిన్న మౌలానా షెహనాయి మున్నగు వాళ్ళ క్యాసెట్స్.

ఆయన బట్టలు పెట్టుకోడానికి రెండు భోషాణాలు, ఓ పదేళ్ళకి సరిపడా నేఫ్తలీన్ బాల్స్, ఐదేళ్ళకి సరిపడా సర్ఫ్, రకరకాల తలనూనెలు (నెత్తిమీద ఒక్క వెంట్రుకుంటే ఒట్టు. నేను పుట్టేటప్పటికే పోయాయి) ఇంకా ఆశ్చర్యకరం.. ఏడాదికి సరిపడా రసుకులు, ఆంగ్రోగ్లూకోజ్ బిస్కెట్స్, ఆరెంజ్ తొనలు (పిప్పర్ మెంట్లు) ఇంకా ఎన్నో ఎన్నెన్నో.. ఏది అవతల పారెయ్యాలన్నా మా ఆయన, మావగారు ఒప్పుకోలేదు. అదీ మంచిదే అయింది. అద్దె ఇంట్లో ఇంత సామానుతో అద్దె ఇంట్లో ఈయన్నీ, ఈయన ఆసనాలని చూసి ప్రజలు భయపడుతుంటే సొంతిల్లు త్వరగా కట్టేసుకున్నాం. (ప్రొద్దున్నే శవాసనం వేసి గుమ్మానికి అడ్డంగా పడుకుంటే గంటసేపు ఊపిరి పీల్చేవారు కారు. పిల్లాడాయన మీంచి పాకుతుండేవాడు. నేను ఆయనను దాటుకుంటూ పనిచేసుకుంటూండేదాన్ని)

ఓసారి మా అన్నయ్య మధ్యాహ్నపు వేళ మా ఇంటికొచ్చి, నేను మాట్లాడ్తుంటే, ముక్కులు ఎగబీలుస్తూ, లేచి వెతుకుతున్నాడు.

"ఏంట్రా?" అంటే "ఎక్కడో ఏదో చచ్చినట్టుందే.. వాసన" అన్నాడు.

నేను వాడి నోరు మూసి వంటగదివైపు చూపించి "మా మావగారు భోంచేస్తున్నారు. ఆయన మజ్జిగలోంచి వస్తోంది ఆ వాసన" అన్నాను.

"ఆ?" అని వాడు నోటితో బాటు ముక్కు కూడా మూసుకున్నాడు.

ఆయన పన్నెండు గంటలకి భోంచేస్తారనగా, ప్రొద్దుట పదిగంటలకి మజ్జిగలో, పొదినా పొడి, కరివేపాకు పొడి, భాస్కర లవణం, సైంధవ లవణం, జీలకర్రపొడి, ఉప్పు, వేపపువ్వు అన్నీ వేసి నానబెట్టేవారు. పులిసిన మజ్జిగలో ఇవన్ని కలిసి, ఎలకలు చచ్చిన వాసన వచ్చేదంటే నమ్మండీ! కానీ ఆయన ఆరోగ్య జాగ్రత్తలని కాదనడానికి మనమెవరం? తొంభై ఏళ్ళు బ్రతికారు. పోయేదాకా రోజూ నాలుగుమైళ్ళు నడిచేవారు.

అగ్గిపుల్లలు గీసాక, వాడేసిన అగ్గిపుల్లల్ని దాచే ఆయన ఒకరు మా చిన్నతనంలో కనిపించారు. ఆయన చెక్కెపెట్టెనిండా ఎన్ని అగ్గిపుల్లలో.

'ఉనిషె ఏప్రిల్' అనే రీతూ పర్ణఘోష్ బెంగాలీ మూవీలో, ఓ సినీతార ఇంట్లో స్టోర్ రూం తెరిస్తే ఎన్ని పాతబడ్డ అమూల్ మిల్క్ పౌడర్ డబ్బాలో, అన్నీ తుప్పుపట్టిపోయి పైన ఉన్న రంగు కూడా మాసిపోయి చూడగానే ఆ డొక్కుల్ని మా చిన్నతనంలో పాకీదొడ్డికి వెళ్తూ తీసుకెళ్ళేవాళ్ళు గుర్తొచ్చారు. ఆ దర్శకుడు (?ట్రాన్స్ జెండర్‌లని ఏమని అనాలో) ఆ డబ్బాలు అంత గొప్పవారి ఇంట్లో ఎందుకు చూపించాడో అని, సినిమా కథ గురించి మర్చిపోయి, చాలాసేపు ఆలోచించాను. అవి సేకరించినందుకు మెచ్చుకోవాలి. అప్పట్లో హార్లిక్స్ సీసాలూ, మిల్క్ పౌడర్ డబ్బాలూ ఖాళీ అయితే వాటిలో వస్తువులు పోసుకోవాలనే కానీ, అందమైన డబ్బాలు కొనుక్కుని కూడా ఈ వస్తువులు పోసుకోవచ్చనే ఆలోచన ఆడవాళ్ళకి ఉండేది కాదనుకుంట.

ఇంకా ఇళ్ళల్లో చెత్త పేరుకుపోవడానికి కారణాలు ఏవస్తువు కొన్నా ఇచ్చే లిటరేచర్స్, ఇంటిముందు కొచ్చి ప్రకటన కర్తలూ, మతప్రచారకులూ ఇచ్చే కరపత్రాలు.

ఓ ఫెయిర్ అండ్ లవ్లీ లాంటి క్రీమ్ కొన్నా, ఆవగింజలో అర్ధభాగం సైజులో అక్షరాలతో ముద్రించిన ఓ లిటరేచర్ బయట పడుతుంది ఇరవై మడతలేసి, అదీ మూడు భాషల్లో. అవి వాడితే మనం శ్రీదేవిలం అయిపోతాం అని నమ్మిస్తూ.

అలాగే అడ్వర్‌టైజ్‌మెంట్లు, ఇళ్ళముందు లెటర్ బాక్స్‌లలో వేసిపోయే కరపత్రాలు. మతప్రచారాలకి ఇచ్చే ఉచిత దేవుడి పుస్తకాలు.

మా రైటర్స్ ఎసోసియేషన్‌లో ఓ అబ్బాయిని చూస్తే మా అందరికీ హడల్.. కనపడగానే జేబులోంచి ఓ ప్రసాదం పొట్లం తీసి ఇస్తాడు. అందులో పేలాలో, లడ్డూనో, పేడానో (డేట్ ఎక్స్‌పైరీ అయిపోయే ఉంటుంది) ఉంటాయి. ఆ తరువాత ఓ కాయితం తీసి ఇస్తాడు. అందులో 'కవితా మాలికా విపంచి నవరసరాగిణి.....' అని డాష్‌లలో పెన్‌తో మన పేరు రాసి ఉంటుంది. అది చదివి మనం 'బాగుంది' అనగానే, వేరేవాళ్ళకి "బలభద్రపాత్రుని రమణిగారు నా అభిమాని, నా కవిత్వం కోసం పడి చస్తారు" అని చెప్తాడు. ఇంకో బాధ ఏమిటంటే ఓ పుస్తకం అచ్చు వేయించి మన చేతుల్లో పెట్టి కాళ్ళకి దణ్ణం పెడ్తాడు. మనం ఆశీర్వదించాక "వందరూపాయలు దాని ధర.. మీరు కాబట్టి 70/- ఇచ్చేయండి" అని నలుగురిలో అడిగి, ఆ డబ్బులు తీసుకుంటాడు. అది కొన్నాం కదా అని తిరిగేసామో... గుండెజబ్బులు రావడం గ్యారంటీ. అంత దుష్టసమాసాలుంటాయి.

ఈ మధ్య ఓ రచయిత్రి రాసిన రెండు పేజీల కథలో, మొదటి పేజీలో ఒక పేరూ, రెండో పేజీలో ఓ పేరూ ఉంది కథానాయకకి. ఇదేవిటండీ? అని నేను అడిగితే.. ఆ కథని మెచ్చుకుంటూ ప్రముఖులు ఎవరెవరు ఎన్నెన్ని గంటలు మాట్లాడిందీ చెప్పి, అయినా కథలో పేర్లకి అంత ప్రాముఖ్యం లేదని అన్నారు ఈయన అని ఓ ప్రముఖ రచయిత పేరు చెప్పింది. అలా చెప్పేటంత కక్ష ఆయనకెందుకుందో మరి? వీళ్ళు రాసిన కథ వీళ్ళే రెండోసారి చదవరా? అలా ఎలా పంపిస్తారు అని నాకు అనుమానం వచ్చింది. దానికీ ఆవిడ వివరణ ఇచ్చింది. పెన్‌డ్రైవ్‌లో రెండు కథలు కలిపి వేసుకుని కన్‌ఫ్యూజ్ అయ్యాను అంది.

ఓహ్ .. టెక్నాలజీ!ఆ ప్రముఖ వారపత్రిక ఎడిటర్ కూడా చదవకుండా ప్రచురించేసారు.

రెండు పేజీల కథకే ఇంత కన్‌ఫ్యూజన్ ఉంటే నవలలూ డైలీ సీరియల్స్ రాస్తే వీళ్ళ పరిస్థితి ఏమిటో?

సో.. బలవంతంగా ఇంటికెళ్ళగానే వాయినంలా ఇచ్చే ఔత్సాహిక రచయితల పుస్తకాలతోటి కూడా ఒక్కోసారి ఇల్లు నిండిపోతూంటుంది.

"ఈ కథలు అస్సలు చదివించేవిగా లేవు. వీళ్ళకి తెలీడం లేదా?" అనిపిస్తుంది. కానీ వాళ్ళకి వాళ్ళ కథలు బ్రహ్మాండంగా ఉంటాయి. అలాగే సెన్సార్‌లో నెలకి 100 సినిమాలు సెన్సార్ అయితే అందులో గ్యారంటీగా 80 చెత్త ఉంటాయి. డైలాగ్స్ బాలేనివీ... అమ్మాయిలూ,

అబ్బాయిల వాచకం, నటనా అస్సలు బాలేనివి, అశ్లీలమైనవీ, అపహాస్యమైనవీ.. కానీ ఎంతలేదన్నా రెండుకోట్ల ఖర్చు పెట్టే తీస్తారు. వీళ్ళకి తెలియదా? ఇవన్నీ అసహ్యంగా ఉన్నాయనీ అనిపిస్తుంటుంది.

కానీ నిజం ఏవిటంటే 'తెలీదు' ఎవరి బిడ్డలు వాళ్ళకి ముద్దుగా కనిపించినట్లు, ఎవరి కథలు, నవలలూ వాళ్ళకి సాహిత్య పురస్కార్‌కి అర్హమైనట్లూ, ఎవరి సినిమాలు వాళ్ళకి 'ఆస్కార్'కి ఆస్కారమున్నట్లూ కనిపిస్తాయి. అవి గొప్పవని మనసా కర్మణా వాచా నమ్ముతారు. సద్విమర్శ చేస్తే ఆగ్రహిస్తారు.

చివరికి మనింట్లో మాత్రం రకరకాల పుస్తకాలూ, కరపత్రాలు, అయిపోయిన పెళ్ళిళ్ళ ఇన్విటేషన్ కార్డులూ, సాంస్కృతిక సంస్థల ఆహ్వాన పత్రికలూ కనిపిస్తుంటాయి.

"ఇది పనికొచ్చేదా? పిచ్చిదా?" అని మా ఆయన నన్ను అప్పుడప్పుడు ఏ ఇయర్ ఫోన్సో, లైటరో, చెమ్చానో పట్టుకొచ్చి చూపించి అడుగుతుంటారు.

ఒక అమ్మాయి నాతో ఎగ్జిబిషన్ కొచ్చి ఓ రోల్డ్‌గోల్డ్ షాపులో "పిచ్చి దుద్దులున్నాయా?" అని అడిగింది.

"ఏవిటీ" అన్నాడు అతను. ఇక్కడ మా ప్రాంతంలో ఈ 'పిచ్చి' తెలీదు.

"పిచ్చివి, చెవికి పెట్టుకునే దుద్దులు" అంది.

"పిచ్చివీ, బొచ్చివీ మేం అమ్మం" కోపంగా అన్నాడతను.

నేను కలగచేసుకుని "అంటే గిల్ట్‌వి బంగారంవి కావు" అని అర్థం చెప్పాను.

ఇలాంటి వ్యవహారికాలు భలే నవ్వు తెప్పిస్తాయి. ఈ 'పిచ్చి'నగలు ఆడపిల్లలున్న ఇళ్ళల్లో గూళ్ళనిండా ఉంటాయి.

ఒకావిడ మా ఇంటికొచ్చి "సత్యనారాయణ చెట్లున్నాయా? మా ఇంట్లో వ్రతం" అంది. ఆ పేరుగల చెట్లు ఉంటాయనే నాకు అప్పటిదాకా తెలీదు. తరువాత మంటపానికి అటూ ఇటూ పెట్టే మెట్టతామర చెట్లని ఆవిడ అలా అంటోందని తెలిసి నవ్వుకున్నాం.

మా ఫ్రెండ్ చెప్పింది, వాళ్ళ చెల్లెలు "కూర్చోండి టిఫిన్ చేస్తా" అంటే "ఒద్దులే" అంటే "వెధవ ఉప్మా ఎంతలోకి చేస్తాం?" అంటుందిట. ఆవిడే వెధవ ఉప్మా అంటే, ఇంక తినే మన పరిస్థితేవిటీ?

ఇంతకీ చెత్తగురించి ఇంత మాట్లాడి మన టీ.వీలో ప్రోగ్రామ్స్ గురించి తలుచుకోకపోతే అన్యాయం.


ఈ మధ్య వస్తున్న సీరియళ్ళనీ, గేమ్ షోస్‌నీ, రియాల్టీ షోస్‌నీ నరకంలో చూపించి, తన ఇమేజ్ పెంచుకుంటున్నాడట యమధర్మరాజు. నేను అందుకే 'కుకరీ షోస్', మావారు 'ఆన్‌లైన్ షాపింగ్' చూసుకుని టెన్షన్ ఫ్రీగా ఉంటున్నాం.


మన్మథనామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు అందరికీ. ఓ సిద్ధాంతి చెప్పినట్లు ఇంకో సిద్ధాంతి నా రాశిఫలాలు చెప్పలేదు మరి. ఎందుకో ఈ డివైడ్ టాక్?

**ఏవైనా 'స్వచ్ఛ భారత్' ఉద్యమంలో మీరూ పాల్గొనండి. చెత్తని వదిలించుకుని పనికి వచ్చేవే జీవితంలో మిగుల్చుకోండి.**

**సర్వేజనా సుఖినోభవంతు.**

Post your comments


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి


సాహితి
కాలమ్ దాటని కబుర్లు-II
బలభద్రపాత్రుని రమణి